
తెలుగు కళాసమితి న్యూజెర్సీ-రాజాలక్ష్మి ఫౌండేషన్‌వారు నిర్వహించిన కథల పోటీలో రూ. 500/- లు బహుమతి పొందిన కథ

# ఆత్మగౌరవం

- ఎ. వెంకటేశ్వర్లు



"ఛీ! ఛీ! మిమ్మల్ని నమ్ముకుని ఇంత దూరం రావడం నాదే బుద్ధి తక్కువ. ఈ విషయం ముందే లెటర్ రాస్తే అసలు రాక పోదును గదా! 'మా పుట్టింటి వారికి గతి లేదు. అదేదో మీరే చేసె య్యండి!' అని మా అత్తగార్నే బతిమాలుకునే దాన్ని..."

- ప్రవాహంలా సాగిపోతోంది సుశీల వాగ్ధోరణి.

"అది కాదమ్మా కొంచెం నిదానంగా విను తల్లీ..." లింగమయ్య నిదానంగా బుజ్జగిస్తున్నట్టుగా అన్నాడు. కూతురి మాటలు ఆయన మనసుని గాయ పరుస్తున్నాయి.

"సుశీలా! డబ్బుంటే మీ నాన్న గారెవ్వడన్నా నీ ముచ్చట కాదన్నారా! ఆయనకి నువ్వంటే ఎంత ప్రాణమో నీకు తెలీదా! అన్నీ తెలిసిన దానివి. చదువుకున్న దానివి. ఆ మాత్రం అర్థం చేసుకోకపోతే ఎలాగమ్మా..." తల్లి అనునయంగా చెబుతోంది. తల్లీ దండ్రీ తనను శాంతపరిచేందుకు ప్రయత్నించినకొద్దీ సుశీలలో కోపం తారాస్థాయి చేరుకుంటోంది. తాము మాట్లాడితే ఇంకేం వినవలసి వస్తుం దోనని భయపడి మౌనంగా నిలబడి చూస్తున్నారు, సుశీల అన్నా వదినా.

- సుశీలకి ఇద్దరే ఆడపిల్లలు, పైగా కవల పిల్లలు. వాళ్ళకి పన్నెండో ఏడు రావడంతో సంప్రదాయం ప్రకారం పుట్టింట్లో ఓణీ వేయించి తీసికెళ్ళేం దుకు మూడు రోజుల క్రితమే పిల్లల్ని తీసుకుని దిగింది సుశీల.

- సుశీల తమకి ఒక్కతే కూతురు. ఆమెకి ఇద్దరే ఆడపిల్లలు-పైగా సుశీల అత్తగారు బాగా వున్నవాళ్ళు-ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని-ఈ

సందర్భంగా పిల్లలకీ, సుశీలకీ పట్టుబట్టలు పెట్టాలని ఎప్పట్నించో అనుకుంటున్నారు లింగమయ్య దంపతులు. కానీ ఈ సంవత్సరం పంటలు సరిగ్గా చేతికి రాకపోవడంతో, సుశీల అన్న కొడుకు లిద్దరూ వేరే వూళ్ళలో కాలేజీల్లో చేరాల్సి రావడంతో, సుశీల ముచ్చట తీర్చేందుకు శక్తి లేకపోయింది లింగమయ్యకు.

– "పట్టుబట్టలు వచ్చే ఏడు పెడతాను. ఈ పని జరిగిపోవడానికి ఏదో మామూలు బట్టలు కట్టుకెళ్ళమ్మా" అని ఆయన అడిగినందుకు సుశీల చేస్తోన్న రాద్ధాంతం ఇది!

– ఆమెకు లోపలి నుంచి కోపం, ఉక్రోషం, ఆవేశం తన్నుకొస్తున్నాయి. రేపొద్దున్న తోడి కోడళ్ళముందు తనెలా తల ఎత్తుకోవాలి? అత్తగారింట్లో తన పరువూ-మర్యాదా, ఆత్మగౌరవం ఇవన్నీ ఏం కావాలి? ఆడపిల్ల అయినందుకు తనకు వుట్టింట్లోనే చిన్నచూపు! ఇక అత్తగారింట్లో ఆత్మగౌరవం గురించి ఆలోచించడం ఎందుకు? సుశీల అందర్నీ బాధిస్తోంది.

–"సుశీలా! అలా కోపంతెచ్చుకోకమ్మా! నాన్నగానీ, నేనుగానీ ఎవ్వరైనా నువ్వడిగింది కాదన్నామా? ఏదో పరిస్థితులు ఇలా వచ్చాయి. పైగా నీ మేనల్లుళ్ళిద్దరూ పై చదువులకి వెళ్ళాల్సి వచ్చింది కదా! చదువుకున్నదానివి. ఆ మాత్రం అర్థం చేసుకోకపోతే ఎలాగమ్మా...?" సుశీల అన్న నిదానంగా నచ్చచెబుతున్నాడు. అతను చదువుకోలేదు. చిన్నప్పటి నుంచీ తండ్రికి పొలం పనుల్లో సాయం చేస్తూ చెల్లెల్ని చదివించాడు. కస్సుమంది సుశీల మళ్ళీ.

"అవును చదివించారు! ఆడపిల్లను చదివించగానే అన్ని సమానత్వాలూ ఇచ్చేసినట్టు మాట్లాడతారు. డబ్బుల్లేవని నీ కొడుకుల చదువు లాగినయ్యా నా పిల్లలకి జరగాల్సిన ముచ్చట ఆగుతోందిగానీ-రేపొద్దున ఆస్తంతా నువ్వొక్కడివేగా అనుభవించేది. నేనెప్పుడన్నా ఓ జాకెట్ ముక్కా, చీరా పట్టుకెళ్ళేదాన్నిగాని నీతో సమానంగా ఆస్తిలో వాటా కొస్తున్నానా... ఆడపిల్లననేగా మీకందరికీ ఇంత చులకన?"

– సుశీల అన్న తెల్లబోయాడు. ఆమె అలా మాట్లాడుతుందని అనుకోలేదు అతను. ఆస్తంతా తనే అనుభవిస్తున్నాడట-నిజానికి-సుశీల చదువుకీ, పెళ్ళికీ అయిన ఖర్చులో సగం కూడా వుండదు- తనకు మిగిలిన ఆస్తి. ఇక ఆమెతో మాట్లాడ్డం అనవసరం అన్నట్టుగా అక్కడ నుంచి వెళ్ళిపోయాడతను.

– "రేపు వెళ్ళిపోతాను నేను" వున్నట్టుండి అంది సుశీల. ఎవ్వరూ మాట్లాడలేదు.

– మాట్లాడినా ప్రయోజనం వుండదని అందరికీ తెలుసు. ఇల్లంతా స్తబ్ధత అలుముకుంది.

– కూతురు వెళ్ళే వేళకి ఏమైనా పిండి వంటలు చేయాలని హడావుడి మొదలుపెట్టింది సుశీల తల్లి అంపమ్మ. తమ పాలేరు భార్య తిక్కమ్మ, ఆమె కూతురు నీలమ్మా వచ్చారు పనుల్లో సాయం చేయడానికి. సుశీల ముభావంగానే ఇంట్లో తిరుగుతోంది. పిల్లల్ని కూడా తాతయ్య అమ్మమ్మ దగ్గరికి వెళ్ళనివ్వడం లేదామె.

– ఆ సాయంత్రం సుశీల పెరట్లో మాతి చప్టా మీద కూర్చుని పిల్లలకి జడలు వేస్తోంది. వాళ్ళమ్మ జల్లెడ పడుతోంది. నీలమ్మకి కూడ ఈ మధ్యే పెళ్ళయింది. 'ఇంత చదువుకున్న దాన్ని స్త్రీ స్వేచ్ఛాసమానత్వాల గురించి పూర్తి అవగాహన వున్నదాన్ని నాకే వుట్టింట్లో గౌరవం లభించడం లేదు. ఇక ఇలాంటి చదువూ సంధ్యా లేని ఆడపిల్లల గతేంటి?' నీలమ్మని చూచి అనుకుంటోంది సుశీల.

– "ఏమ్మా! అమ్మాయిగారు అప్పుడే వెళ్ళిపోతున్నారు?" తిక్కమ్మ అడిగింది. అంపమ్మ ఉలిక్కిపడింది. "ఏం లేదు! అల్లుడుగారు అర్జంటుగా ఏదో వూరు వెళ్ళాలట. రమ్మని టెలిగ్రాం ఇస్తేనూ" అని అసలు విషయం దాటేస్తూ "అవును తిక్కమ్మా, నీలమ్మ పెళ్ళి చేశావు. అది వుట్టిన కాణ్ణించీ కష్టపడుతూనే వుంది. ఆ అత్తింట్లో ఏం సుఖపడుతోందో ఏమో! నాలుగు రోజులు హాయిగా గడపడానికొస్తే దాని చేత అడ్డమైన చాకిరీ చేయిస్తావేమిటి? నేను చూస్తూనే వున్నా-అది వచ్చిన కాణ్ణించి పన్లోకి వెళ్తూనే వుంది" తన కూతురు గురించిన మాట మార్చి తిక్కమ్మ కూతురి గురించి అడుగుతోంది అంపమ్మ.

"బాగుందమ్మా! దానిని పని చెయ్యమని మేమంటామా? చూసి నోళ్ళలాగే అనుకుంటారు. మరి..." అంపమ్మ, సుశీల కూడా ఆశ్చర్యపోయారు తిక్కమ్మ మాటలకి. "మరి నీకేం రోగమే-హాయిగా తిని కూర్చోక" అంపమ్మ కొంచెం నవ్వుతూ అంది. నీలమ్మ పిండి కొట్టడం ఆపింది. ఆమె చేతిలోంచి రోకలి తిక్కమ్మ అందుకుంది. "అళ్ళ కోసం గాదమ్మా! నా కోసం నేనెల్తున్నా కూలికి-" నీలమ్మ మాటలు అర్థం కాలేదు తల్లీకూతుళ్ళిద్దరికీ.

"మేం ఒక్క చీరా రవికా కూడా కొనిపెట్టలేనోళ్ళ మన్నట్టు ఈ నాల్గు రోజులూ కష్టపడి తన డబ్బుతో తనే కొనుక్కోల్తదంటమ్మా-చీరా రైకా" కొంచెం నిష్టూరంగా చెప్పింది తిక్కమ్మ. "అది గాదమ్మా! ఇప్పుడు నా కోసం ఈళ్ళు వందో రెండొందలో ఖర్చు పెడతారు. వద్దంటే వినరు. అదే నా ఖర్చుకి నేనే సంపాదించుకుంటే, నాకు పెట్టే డబ్బుల్తో నెల రోజులు కూర్చుని తినొచ్చు మా అమ్మా, అయ్యా. వుట్టింటి నుంచి కోక కట్టుకు రాకపోతే మా అత్తా మామా ఆడబిడ్డలు అందరూ చిన్నచూపు చూస్తారు. నన్నంటే బాధలేదు. మీ అమ్మా అయ్యా గతిలేనోళ్ళని అళ్ళని కూడా తిడతారు. అందుకే ఈ నెల రోజులు ఓపినంత కష్టం జేసుకుని నేనే జత కోకలు కొనుక్కోల్తాను..." నీలమ్మ చెప్పడం ఆపింది.

– సుశీల తెల్లబోయింది. ఆమెలో అంతవరకూ పౌరుషాన్ని రెచ్చగొడుతున్న 'ఆత్మగౌరవం' కొత్త అర్థంలో కనబడుతోంది. తల్లిదండ్రుల్ని పీడించుకు తిని తన ఆత్మగౌరవం కాపాడుకోవాలనుకుంటోంది తను. కానీ నీలమ్మ ఆత్మగౌరవం అనే పెద్ద మాటకి అర్థం తెలియకపోయినా, తల్లిదండ్రులకు భారం కాకుండా తన గౌరవం-వుట్టింటి గౌరవం నిలబెట్టుకుంటోంది. నీలమ్మ జల్లెడ పడుతున్న పిండిలా సుశీల ఆలోచనలు మెత్తగా తెల్లగా-స్వచ్ఛంగా సాగుతున్నాయి. ◆





బలభద్రపాత్రుని
రమణి
కొత్త సీరియల్
త్వరలో